# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

- న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈరోజు ముగిసింది.
- పరస్పరం అనుసంధానమై ఉన్న నేటి ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- బ్రిక్స్ డిజిటల్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ రైతులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.

===================

పరస్పరం అనుసంధానమై ఉన్న నేటి ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని బ్రిక్స్ దేశాలకు ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత్ మండపంలో బ్రిక్స్ సదస్సు చివరి రోజైన ఈరోజు 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత-సమ్మిళిత ప్రపంచ వృద్ధి కోసం భవిష్యత్తును తీర్చిదిద్దడం' అనే అంశంపై నరేంద్రమోదీ మాట్లాడారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత, తక్షణ చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని ప్రధానమంత్రి అన్నారు. విపత్తుల నిర్వహణ కోసం ముందస్తు హెచ్చరికల సమాచార సమీకరణ మార్గదర్శకాలను రూపొందించినట్లు నరేంద్రమోదీ వెల్లడిస్తూ...

(వాయిస్... 20 సెకన్లు)

===================

గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకకు బ్రిక్స్‌లో ప్రాధాన్యం లభించడం, వాటి అనుభవాలకు గౌరవం దక్కడం వల్ల బ్రిక్స్‌పై వాటి విశ్వాసం మరింత పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. వైవిధ్యం, సహకారమే బ్రిక్స్ బలం అని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్...25 సెకన్లు)- గ్లోబల్ సౌత్

===================

బ్రిక్స్ డిజిటల్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ రైతులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను రైతుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా సమన్వయం చేయనున్నట్లు చెప్పారు.

(వాయిస్...28 సెకన్లు)

===================

ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ముంబైలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పడటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సెప్టెంబర్ 17వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో ఆయన ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్నారని అమిత్ షా తెలియజేశారు.

===================

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్-సౌదీ అరేబియా మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే మార్గాలపై కూడా చర్చించారు.

===================

మహమ్మారుల సన్నద్ధత విషయంలో భారత్ దశాబ్దం క్రితం ఉన్న పరిమితులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు కోలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్ - సీఈపీఐ బోర్డు ఉన్నత స్థాయి సమావేశంలో మంత్రి ప్రసంగించారు. భవిష్యత్తులో తలెత్తే అంటువ్యాధులు, మహమ్మారులను ఎదుర్కొనేందుకు ప్రపంచ సన్నద్ధతకు తోడ్పడగల శాస్త్రీయ వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు.

===================

విరామం

===================

న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఈరోజు ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముగింపు ప్రసంగం చేస్తూ.. బ్రిక్స్ వైవిధ్యమే దాని ప్రత్యేకతగా కొనసాగాలని, సహకారం దానికి స్ఫూర్తిగా నిలవాలని, దాని ప్రగతి మానవాళి సంక్షేమానికి దోహదపడాలని ఆకాంక్షించారు. బ్రిక్స్ కేవలం దేశాల సమూహం మాత్రమే కాదని, పరిష్కారాలను అందించే ఒక సమగ్ర వ్యవస్థగా రూపుదిద్దుకుంటోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. గత రెండు రోజులుగా జరిగిన చర్చలు ఈ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశాయని వివరిస్తూ..

(వాయిస్...25 సెకన్లు)- బ్రిక్స్ ముగింపు

తదుపరి బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న చైనాకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు.

===================

చెన్నై విమానాశ్రయం టెర్మినల్-1లో ఏర్పాటు చేసిన క్యాబ్ పికప్ ప్లాజాను కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి రామ్ మోహన్ నాయుడు ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సదుపాయం ద్వారా ప్రయాణికులకు క్రమబద్ధమైన, సౌకర్యవంతమైన, అవాంతరాలు లేని క్యాబ్ పికప్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొంది.

===================

బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం-2026 సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలువురు ప్రపంచ దేశాల నేతలతో ఈరోజు వరుసగా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్-జోమార్ట్ టొకాయెవ్ తో నరేంద్రమోదీ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించారు. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్-సిసీతో,ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్ తో కూడా ప్రధానమంత్రి సమావేశమయ్యారు.

===================

భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య పురుషుల మూడు క్రికెట్ టీ-20 మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా మొదటి మ్యాచ్ ఈరోజు ఢిల్లీలో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతోంది. భారత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. 11 ఓవర్లు ముగిసే సరికి అఫ్గానిస్థాన్ 5 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. మరో వైపు దుబాయ్ లో భారత్, శ్రీలంక జట్లు మధ్య ప్రారంభమైన మహిళల ఆసియా కప్- 2026 ఫైనల్ మ్యాచ్లో భారత్ టాస్ గెలిచి 6.4 ఓవర్లు ముగిసే సరికి వికెట్ కోల్పోకుండా 67 పరుగులు చేసింది. షాఫాలి వర్మ 47 పరుగులతో, స్మృతి మందన 20 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

హాకీలో భారత మహిళల జట్టు జూనియర్ ఆసియా కప్ టైటిల్‌ను వరుసగా మూడోసారి కైవసం చేసుకుంది. చైనాలోని మోచిలో ఈరోజు జరిగిన ఫైనల్లో భారత్, చైనాపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున సనికా చంద్రకాంత్ మానే 17వ నిమిషంలో ఏకైక గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. అంతకుముందు 2023, 2024 సంవత్సరాల్లోనూ భారత్ ఈ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

పారా బ్యాడ్మింటన్‌లో టోక్యో పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ప్రమోద్ భగత్ జపాన్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్ ఎస్ఎల్-3 విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ప్రమోద్ భగత్ సింగిల్స్ ఫైనల్లో మరో భారత ఆటగాడు ఉమేశ్ కుమార్ పై 21-16, 21-8 తేడాతో విజయం సాధించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ దేశాలు-2026 బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ఆమోదించిన న్యూఢిల్లీ ప్రకటనను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రశంసించింది. డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధానోమ్ గెబ్రెయేసస్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ, అందరికీ సార్వత్రిక ఆరోగ్య సేవలు అందించడం, పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థలను నిర్మించడం పట్ల బ్రిక్స్ దేశాలు వ్యక్తం చేసిన నిబద్ధతను అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =